క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

ముమ్మిడివరం: ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రెడ్ క్రాస్ సంస్థ అండగా నిలిచింది. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌కు చెందిన మోర్త ఆదిలక్ష్మి తాటాకిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెయ్యాల చిట్టిబాబుల చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామగ్రి, హైజీన్ కిట్స్, బియ్యం, కూరగాయలు మంగళవారం అందజేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, ఎం.శివ కుమార్, శేఖర్, రత్న ప్రసాద్, శ్రీనివాస్, రేకాడి వర్మ తదితరులు పాల్గొన్నారు.

వందన మరిన్ని విజయాలు సాధించాలి



వందనను సత్కరిస్తున్న ఆలయ చైర్‌పర్సన్ వీరితాదేవి తదితరులు

అమలాపురం టౌన్: మలేషియాలో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి పలు పతకాలు సాధించిన అమలాపురానికి చెందిన పిల్లి వందనను పలువురు అభినందించారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరితాదేవి, మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు వందనను మంగళవారం సత్కరించారు. వందన అంతర్జాతీయంగా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉపాధి మేట్‌లకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మేట్‌లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి మస్తర్ల నమోదుపై మేట్‌లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు మస్తర్లు నమోదు చేసే సమయాల్లో దిద్దుబాట్లు లేకుండా చూడాలన్నారు. కూలీలను సకాలంలో సమీకరించడం, ఉపాధి కూలీలకు 100 రోజుల పని దినాలు, పని ప్రదేశంలో ప్రాథమిక చికిత్సకు అవసరమైన కనీస సౌకర్యాలు, నీడ, తాగునీరు కల్పించడం, కొత్త జాబ్ కార్డులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుబాబు, టీఏలు అనిల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

యానాం: పట్టణంలో బుధవారం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బెజవాడ గార్డెన్స్‌లో ఎంఎల్ఏ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన స్థలంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నామని చెప్పారు. క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చేందుకు సీవైఏఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు, హెర్మోన్ మినిస్ట్రీస్ పాస్టర్ డాక్టర్ ఎం.జోషఫ్ కిషోర్ హాజరుకానున్నారని తెలిపారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం

అమలాపురం టౌన్: జిల్లాలోని 22 మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించినట్లు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ తెలిపారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో గౌతమ్ అతిథిగా పాల్గొని కొత్తగా నియమితులైన మండల పార్టీ అధ్యక్షులకు నియామక పత్రాలు అందించారు.కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు ముషిణి రామకృష్ణారావు, కొత్తూరి శ్రీనివాస్, పలు నియోజకవర్గాల పార్టీ కన్వీనర్లు వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీను, గెద్దం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దివి వెంకన్నబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్నబాబును నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

ఆరోగ్య ప్రాప్తిరస్తు



- మాతాశిశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- ఎంసీపీ కార్డుతో అనేక ప్రయోజనాలు

ఐ.పోలవరం: మాతాశిశు మరణాలు నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో సమూల మార్పులకు నాంది పలికింది. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకంతో పాటు నిర్ణీత సమయంలో టీకాలు అందించడం, మందుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టింది. మహిళలకు మెరుగైన ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సులభంగా ప్రసవాలు జరిపేందుకు సత్వర చర్యలు తీసుకుంటుంది. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించవలసిన టీకాలతో కూడిన విలువైన సమాచారంతో మాతా శిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముద్రించింది. పీహెచ్‌సీ స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ కార్డులను అందించడంతో ఆరోగ్య సిబ్బంది గర్భిణులకు అందజేస్తున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకూ తీసుకోవలసిన జాగ్రత్తలు అందులో పొందుపరిచారు. సాధారణ వైద్య పరీక్షలు, రక్తపోటు, మూత్ర పరీక్షలు చేయించుకోవలసిన సమయాలను అందులో వివరించారు. అనారోగ్యానికి గురైతే చికిత్సను చేయించుకోవలసిన విధానం సులభంగా తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. కార్డులో ఇచ్చిన సమాచారాన్ని వినియోగించుకోవడం ద్వారా గర్భిణులు సులభంగా తొమ్మిది నెలలు పూర్తయ్యి బిడ్డను ప్రసవించే నాటికి కనీసం 10 కేజీల బరువు పెరిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధాన మాతృత్వ వందన యోజన, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది.

తల్లీబిడ్డలకు ఎంతో ఉపయోగం

ఎంసీపీ కార్డులో ఆరోగ్య సిబ్బంది అందించవలసిన సేవల వివరాలతో పాటు వ్యాధి లక్షణాలను తెలియజేస్తారు. గర్భాశయం ముఖ ద్వారానికి, రొమ్ముకు వచ్చే క్యాన్సర్ లక్షణాలు, సంచార చికిత్స ద్వారా అందించే చికిత్స విధానం, తొలి కాన్పులో సాధారణంగా సంభవించే సమస్యల వివరాలు కార్డులో పొందుపరిచారు. బిడ్డకు తల్లి పాలు అందించడం వల్ల కలిగే ప్రయోజనాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహారం వివరాలు సైతం కార్డులో ఉంటాయి. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాధాన్యతను సైతం కార్డులో తెలియజేశారు.

శిశువులకు టీకాలే శ్రీరామరక్ష



అప్పుడే జన్మించిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకూ సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఆ చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఎక్కువ. నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేందుకు వీలుగా ఈఎంసీపీ కార్డుల్లో టీకాల కాల నిర్ణయ పట్టికను రూపొందించారు. అందుకే ఆసుపత్రికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఎంసీపీ కార్డును వెంట తీసుకువెళ్లాలి. ఎంసీపీ కార్డులపై అవగాహన పెంచుతున్నాం.

– డాక్టర్ శివగాయత్రి, వైద్యాధికారి, కేశనకుర్రు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

అల్లవరం: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. తుమ్మలపల్లిలో ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలుచేయడమే కాకుండా ప్రకటించని హామీలను సైతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌దన్నారు. అర్హులను గుర్తించి ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. సంక్షేమం నిర్విరామంగా కొనసాగాలంటే ఏపీకి జగనన్న అవసరం ఉందన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకుల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డుని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, జీఎస్‌కే కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్ బళ్రే సీతారత్నం, ఎంపీటీసీలు గుబ్బల బాబ్జి, మాకే కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, కాట్రు శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డుని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

లబ్ధిదారుల ఖాతాలకు నష్టపరిహారం

కాట్రేనికోన: పల్లం పంచాయతీ పరిధిలో రూ.74 కోట్ల ఓఎన్‌జీసీ నష్టపరిహారాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ అన్నారు. పల్లం గ్రామంలో సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి అధ్యక్షతన మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాల ప్రగతి నివేదిక బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, పార్టీ జెండాను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలెపు ధర్మారావు, పాలెపు సత్యానందం, బొంతు అజయ్ కుమార్, కోలాటి సత్యం, వినాయకుడు తదితరులు పాల్గొన్నారు.



పల్లంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు అన్నారు. మంగళవారం పి.మల్లవరం పంచాయతీ కార్యాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో పి.మల్లవరం పంచాయతీలో వివిధ పథకాల ద్వారా సుమారు రూ.21 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. అనంతరం పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీను, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ పిల్లి వీర నాగు, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, రాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం జెడ్పీ పాఠశాలలో మంగళవారం జరిగిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మండలంలోని 11 జెడ్పీ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు రూపొందించిన 58 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రదర్శనను ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ బీర సత్యకుమారి, వైఎస్ ఎంపీపీ పి.బాబ్జిరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, తహసీల్దార్ ఝాన్సీ లక్ష్మి తదితరులు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్.కొండారెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడకు సైన్సు ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఎంపీడీఓ చైతన్యకుమార్ మాట్లాడుతూ తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.



కేశనకుర్రుపాలెంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సోలార్ అండ్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టుని ప్రదర్శిస్తున్న అల్లవరం విద్యార్థులు

మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎంఈఓ బొజ్జా రమణశ్రీ ప్రదర్శనను ప్రారంభించారు. మండలంలోని 13 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బీర హనువంతరావు, కిరణ్‌కుమార్, లక్ష్మణరావు, తాడి కృష్ణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత

అల్లవరం: విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయవచ్చని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కిరణ్‌బాబు అధ్యక్షతన మంగళవారం మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్ట్ నమునాలను ప్రదర్శించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు బొమ్ము బాలవేణి, బళ్రే సీతారత్నం, ఎంపీటీసీలు ఎస్.మౌనిక, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్, హెచ్ఎం నైనాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: విద్యార్థులు సైన్స్‌పై మరింత అవగాహన పెంచుకోవాలని ఎంఈవో సత్తి సత్యకృష్ణ సూచించారు. మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్సు విజ్ఞాన ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ప్రదర్శనను సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు ప్రారంభించారు. మండలంలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారుచేసి బహుమతులను పొందారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి రత్న కుమారి, నాగులపల్లి శేషవేణి, హెచ్ఎం నూకల సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ సబ్బతి జ్యోతి తదితరులు ప్రదర్శనను తిలకించారు.

తాగునీటి పైపులైన్‌లకు శంకుస్థాపన



తాగునీటి ట్యాంకు, పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: జగనన్న కాలనీల్లో ఇంటింటికీ కుళాయిలు పథకంలో భాగంగా రూ.83 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పైపులైన్‌లకు టీటీడీ పాలక మండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. గాడిమొగ జగనన్న కాలనీలో రూ.43 లక్షలతో తాగునీటి ట్యాంకు, పైపులైన్ నిర్మాణానికి, పెదవలసలలో రూ.20 లక్షలతో, పోలేకుర్రు జగనన్న కాలనీలో రూ.26 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్‌లు కామాడి గోవలక్ష్మి, వెంటపల్లి నూకరాజు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద కుమార్, రాయుడు గంగాధర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కాపవరపు శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు చెక్కా కామేశ్వరరావు, బళ్ల సంధ్యారాణి, ఈఓపీఆర్‌డీ ఎం.భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు



మురమళ్ల సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గోదావరిలో త్రిశూల స్నానం జరిపిస్తున్న పండితులు

ఐ.పోలవరం: మురమళ్లలో వేంచేసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజు ఉదయం పూర్ణాహుతి, హోమాలు నిర్వహించారు. అనంతరం నాగాభట్ల శ్రీరామశర్మ దంపతుల ఆధ్వర్యంలో గోదావరిలో త్రిశూల స్నానం, రాత్రి ఆలయంలో పుష్పోత్సవం జరిపించారు. గుత్తినదీవి-వేమవరంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

యానాం: పట్టణంలో కొలువైన శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న)వారి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని మూడోరోజు మంగళవారం అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు, పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాతసేవ, మూలవిరాట్‌కు, అమ్మవారికి, ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థప్రసాదాల వితరణ జరిపారు.

ఎమ్మెల్యే పొన్నాడను కలిసిన శంకరరావు



ఎమ్మెల్యే పొన్నాడను సత్కరిస్తున్న శంకరరావు

అమలాపురం రూరల్: ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత ఉపాధ్యక్షుడిగా నియమితుడైన బండారులంక చెందిన చందన శంకరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు, పెదపూడి బాబురావు, కాసిన చిట్టిరాజు, భోజనపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



పేరూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. పేరూరు పరిధిలో గౌతమ్‌నగర్, యల్లగడ్డవారిపేటలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల జీవన ప్రమాణాలు పెరిగేలా గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే తక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్ అరుణ డేవిడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు చొల్లంగి సుబ్బరామ్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, ఎంపీటీసీలు వాసంశెట్టి శ్రీను, దొంగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి

యానాం: పది, ఇంటర్ కోర్సుల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించడానికి ఉద్దేశించిన ఫైలుకు మంగళవారం ఎల్జీ తమిళిసై సౌందరాజన్ ఆమోదం తెలిపారు. ఇక నుంచి పుదుచ్చేరి రాష్ట్రస్థాయి, రీజియన్ స్థాయిల్లో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేయనున్నారు. అదే విధంగా వ్యక్తిగత సబ్జెక్టుల్లో 100 మార్కులు సాధించిన విద్యార్థులకు సైతం రూ.5 వేల నగదు బహుమతిని అందజేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పథకం 2023–24 విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వస్తుందన్నారు.

సంక్షిప్తంగా..

నైటింగేల్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు, మిషనరీల్లో పనిచేస్తున్న నర్సులు, ఏఎన్ఎంలు, ఎల్‌హెచ్‌వీల నుంచి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు-2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెల్త్ డైరెక్టర్ శ్రీరాములు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ health.py.gov.in నుంచి అవార్డు ఎంపికకు సంబంధించి నియమ నిబంధనలతో కూడిన దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవొచ్చన్నారు. వచ్చే నెల 3వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాలి

తాళ్లరేవు: ఈ నెల 24వ తేదీన విశాఖపట్టణం పోలీస్ బ్యారెక్ గ్రౌండ్‌లో నిర్వహించే 6వ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దివ్యాంగులు పాల్గొనాలని అథ్లెటిక్స్ క్రీడాకారిణి గాలిదేవర శివగంగ దుర్గ అన్నారు. మంగళవారం ఆమె తాళ్లరేవులో విలేకర్లతో మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99634 89799 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్యాట్ ధర్మాసనం ఏర్పాటు

యానాం: ఉద్యోగ, విద్యా సంబంధ తీర్పులను ఇచ్చే సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) ధర్మాసనం(బెంచ్)ను పుదుచ్చేరిలో ఏర్పాటుకావడంతో దానిని మంగళవారం సీఎం రంగసామి ప్రారంభించారు. యానాం తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ఉద్యోగులు, విద్యార్థులు తమ సమస్యలపై న్యాయం కోసం మద్రాసులోని క్యాట్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో దూరం వెళ్లాల్సి రావడంతో వ్యయ, ప్రయాసలకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పుదుచ్చేరిలో క్యాట్ బెంచ్ ఏర్పాటుచేయాలని విజ్ఞాపనలు వస్తుండడంతో బెంచ్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో క్యాట్ జ్యుడిషియల్ మెంబర్, హెచ్‌ఓడీ లతా బస్వరాజ్ పాట్నీ, స్పీకర్ సెల్వం, అడ్మినిస్ట్రేటివ్ సభ్యుడు వరుణ్‌సింధు, స్వామినాథన్, ప్రీతిసింగ్ పాల్గొన్నారు.

బీఎస్పీ రాజ్యాధికార సభ

అమలాపురం టౌన్: స్థానిక ముస్లిం షాదీఖానా భవనంలో నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో రాజ్యాధికార సభ మంగళవారం జరిగింది. సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ రాష్ట్రంలోని 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. సభలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పార్టీ ఇన్‌ఛార్జ్‌లు బత్తుల లక్ష్మణరావు, వాకపల్లి భీమారావు, కుసుమ వెంకటేశ్వరరావు, కాండ్రేగుల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమణారావు

అమలాపురం టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన అల్లవరం మండలం మొగళ్లమూరు శివారు సిరిగట్లపల్లికి చెందిన రొక్కాల సురేష్‌కు గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. అమలాపురంలోని ఫౌండేషన్ కార్యాలయంలో బాధితుడు సురేష్ భార్య గౌతమికి ఈ మొత్తాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గంటా లక్ష్మీప్రసాద్, కొంకి మనోజ్, కుంచే అర్జున్, నాగాబత్తుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంకలో క్షత్రియ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ పాతూరి కార్తికేయవర్మ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో 14 మంది క్షత్రియ పేద కుటుంబాలకు మంగళవారం నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీనువర్మ, వల్లీ బాబాయ్, తేజ వర్మ, చైతన్యవర్మ, విజయ రామరాజు, సాయివర్మ పాల్గొన్నారు.

ఉమర్ అలీషా విద్యాపీఠంలో పూజలు

తాళ్లరేవు: మండలంలోని కేశవపురంలో ఉన్న ఉమర్ అలీషా విద్యా పీఠంలో ఉమర్ అలీషా ఆధ్వర్యంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులచే ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆశ్రమవాసి జ్యోతి, గుబ్బల మంగాయమ్మ, ఉమామహేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.